ప్రజా హక్కుల పరిరక్షణకు బలమైన ఉద్యమాలు

- దేశంలో పెరిగిన హింస, అణచివేతను ఎదుర్కొందాం
- ప్రజాస్వామ్యం, రాజ్యాంగ రక్షణకు ఒక్కటిగా నిలబడదాం
- ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక 30వ వార్షికోత్సవ జాతీయ సదస్సులో వక్తలు

అభివాదం తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ప్రజా హక్కుల పరిరక్షణకు బలమైన ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరముందని పలువురు వక్తలు సూచించారు. ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక 30వ వార్షికోత్సవ జాతీయ సదస్సును మంగళవారం హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో "రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో పార్టీలు, ప్రజా ఉద్యమాల పాత్ర" అనే అంశంపై వేదిక నాయకురాలు మేధాపాట్కర్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజా ఉద్యమకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో పెరిగిన హింస, అణచివేతను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ రక్షణకు ఒక్కటిగా నిలబడదామన్నారు.

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రజా ఉద్యమకారులు, రాజకీయ కార్యకర్తలు కలిసి పని చేయాలని సూచించారు. దేశంలో మతోన్మాదం పెరుగుతున్న సమయంలో రకరకాల వివక్ష పెరుగుతున్నదని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎన్నిక కావడమంటే రాజులుగా భావించవద్దనీ, ప్రజలు పరిమిత అధికారాలతో ఎన్నుకున్నారని గుర్తు పెట్టుకోవాలన్నారు. పెట్టుబడిదారులు, మార్కెట్ కోసం పని చేసేందుకు రాజకీయ పార్టీలు కాదనీ, ప్రజల కోసమన్నారు. అట్టడుగు వర్గాల కోసం పని చేయాలని ఆకాంక్షించారు. ప్రజా ఉద్యమాలపై బుల్డోజర్ నడుస్తున్నదని, రాజ్యం మార్కెట్ రాజ్యాంగ మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అసలైన సమస్యలు చర్చకు రానివ్వకుండా పాలకులు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజల సామాజిక, ఆర్థిక మార్పు కోసం చేస్తున్న రాజకీయమే నిజమైన రాజకీయమన్నారు. ఆ పనిని ప్రజా ఉద్యమాలు చేస్తున్నాయని కొనియాడారు. నోరు లేని గిగ్ వర్కర్ల వంటి వారి కోసం జరిగే ఉద్యమాలు ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలోనే పరిమితం కాకుండా జాతీయ ఉద్యమంగా మారాలని ఆకాంక్షించారు.

సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావ్లే మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధిద్దామని సూచించారు. సంయుక్తకిసాన్ మోర్చా(ఎస్కేఎం) రైతు వ్యతిరేక నల్లచట్టాలపై చేసిన 13 నెలల పోరాటంలో ప్రజా ఉద్యమాల వేదిక భాగస్వామిగా ఉందని గుర్తుచేశారు. రెండు సార్లు ప్రధానమంత్రి నరేంద్రమోడీ మెడలు వంచామని తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లను ఏప్రిల్ నుంచి కార్మికులపై రుద్దేందుకు కేంద్రం సిద్ధమైందనీ, దానికి వ్యతిరేకంగా కార్మికులు చేపట్టబోయే భారత్ బంద్‌లో ఎస్కేఎం భాగస్వామి అవుతుందని చెప్పారు. ఉద్యమాలు తిప్పికొట్టిన నల్ల చట్టాలను తిరిగి దొడ్డిదారిన తెచ్చేందుకు మోడీ సర్కార్ ప్రయత్నిస్తోందని తెలిపారు.

సిపిఐ జాతీయ నాయకురాలు అనీరాజా మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నయా ఆర్థిక విధానాలతో నిర్లక్ష్యానికి గురవుతున్న సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం పోరాడాలని సూచించారు. ఇటీవల జరిగిన ఢిల్లీ ఎన్నికల్లో మహిళల హక్కులపై కాకుండా మహిళలకు తాయిలాలు ప్రకటించే దానిపైనే చర్చ జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో లౌకికవాదం, సోషలిజం విలువల కోసం పోరాటాలు ముందుకెళ్లాలని ఆకాంక్షించారు.

టిజెఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఉద్యమకారులు - రాజకీయ పార్టీల మధ్య చర్చలు విస్తృతంగా జరగాలని తెలిపారు. అన్ని సమస్యలపై బలమైన ఉద్యమాలు నిర్మాణం కావాలన్నారు. ప్రజా రాజకీయాలు పెరగాలని, ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకున్నప్పుడే ఉద్యమాలు లక్ష్యం చేరినట్టు అని వ్యాఖ్యానించారు. జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ నుంచి అనేక విషయాలను నేర్చుకోవాలని కోరారు.

సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ సెంట్రల్ కమిటీ మెంబర్ క్లిఫ్టన్ మాట్లాడుతూ ఫాసిజం పెరిగి దేశంలో అన్ని వర్గాలు బాధితులుగా మారారని తెలిపారు. దేశంలో జనగణన జరగాలనీ, అణగారిన కులాల రిజర్వేషన్లు పెరగాలన్నారు.

సమాజ్‌వాదీ పార్టీ ఎంపి జావెద్ అలీ మాట్లాడుతూ బలమైన ప్రజా ఉద్యమాలతోనే రాజకీయ నిర్ణయాల్లో మార్పులు వస్తాయని తెలిపారు.

మేధా పాట్కర్ మాట్లాడుతూ యుపిఎ హయాంలో ప్రజల హక్కులకు సంబంధించిన అనేక చట్టాలు వచ్చాయని గుర్తుచేశారు. ఆ చట్టాల అమలు కోసం కాంగ్రెస్ పోరాడితే ప్రజలు కాంగ్రెస్ వెంట ఉంటారని తెలిపారు. 2013 భూసేకరణ చట్టం తదితర చట్టాలను ఆమె ఉటంకించారు. ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక అన్ని రకాల హింసలకు వ్యతిరేకంగా గళమెత్తుతుందని తెలిపారు. ప్రజల జీవించే హక్కును కాపాడాల్సిన అవసరముందని తెలిపారు.

వేదిక నాయకులు విస్సా కిరణ్ మాట్లాడుతూ నదుల పరిరక్షణ కోసం ఒక నమూనా చట్టాన్ని తీసుకురానున్నట్టు తెలిపారు. భూసేకరణ బాధితులకు న్యాయం చేసేలా దేశంలో ఒక కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

బలమైన ఉద్యమ నిర్మాణం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం బలమైన ఉద్యమాలను నిర్మించాలని సదస్సు తీర్మానించింది. నదుల పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణతో పాటు మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలను తీవ్రతరం చేయనున్నట్టు నాయకులు తెలిపారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడుతూ జాతీయ సదస్సులో 22 రాష్ట్రాల నుంచి పాల్గొన్న ప్రతినిధులు ఆయా రాష్ట్రాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించినట్టు తెలిపారు.

ప్రజలను పోలీసులు ఆపడం సమర్థనీయం కాదు

మూసీ ప్రజలను కలిసేందుకు వెళ్లిన మేధాపాట్కర్‌ను పోలీసులు ఆపడం సమర్థనీయం కాదని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ వ్యాఖ్యానించారు. మేధాపాట్కర్‌నే కాదు... రాజ్యాంగ పరిధిలో ప్రజలందరూ స్వేచ్ఛగా తిరిగే హక్కు కలిగి ఉన్నారని ఆమె గుర్తుచేశారు.

రైతులతో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ఫోర్త్ సిటీ పేరుతో భూసేకరణ ఆపాలి

- లేకుంటే సిఎం ఇల్లు ముట్టడిస్తాం
- ఫార్మాసిటీ బాధిత రైతులకు అండ : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫోర్త్ సిటీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూములను లాగేసుకుంటుందని, ఈ బలవంతపు భూసేకరణను ఆపకపోతే సిఎం ఇల్లును ముట్టడిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మేడిపల్లి, నక్కర్తలో ఫార్మాసిటీ బాధిత రైతులను జాన్‌వెస్లీ కలిశారు. ఇంటింటికి తిరుగుతూ గ్రామంలో స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాన్‌వెస్లీ రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫార్మాసిటీ బాధిత రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీ ఏర్పాటుపై స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఫోర్త్ సిటీ పేరుతో దొడ్డి దారిన రైతుల అనుమతి లేకుండా భూములను గుంజుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే ఫార్మా బాధిత గ్రామాలైన మేడిపల్లి, నానక్ నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలతో పాటు కందుకూరు మండలంలో పర్యటించి, సదస్సులు నిర్వహించి రైతుల సమస్యలపై నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. ఎన్నికలకు ముందు ఫార్మాసిటీని రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక మాట మార్చిందని విమర్శించారు. రైతుల పేర్లను రికార్డుల్లో నుంచి తొలగించి అటు ప్రభుత్వం, ఇటు అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రైతుల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తక్షణమే ప్రభుత్వం పైన ఒత్తిడి పెంచి రైతులందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ప్రభుత్వం హైకోర్టు ఆర్డర్‌ను వెంటనే అమలు చేసి నిషేధిత జాబితాలో ఉన్న రైతుల పేర్లు తొలగించి, వారికి రైతు భరోసా, రైతు బీమా, పంట లోన్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరుబాటను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. మధుసూదన్ రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు పి. అంజయ్య, పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు పి. బ్రహ్మయ్య, ఫార్మా బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

సహకరించిన అందరికీ కృతజ్ఞతలు

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి తాను పోటీలో ఉండి గత నాలుగు నెలలుగా ప్రచారం చేస్తున్న సందర్భంలో తనకు సహకరించిన ప్రతిఒక్కరికీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తనను ఆదరించి ఓటేసి రెండోస్థానంలో నిలబెట్టిన ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ధన్యవాదాలు ప్రకటించారు.

In the Court of the Addl. Senior Civil Judge: Tirupati
E.A.No. 236/2024,
O.E.P. No. / 2024
O.S.No.168/1984
M.Venkatamuni Reddy (died) & Others ...D.Hrs
Vs.
V.Venkatamuni Chetty (died) & Others ..J.Drs
NOTICE TO The J.Dr. No.3
Jdr.3) G.Jyothi W/o G.Narasimha Rao, D.No.4-2-52, Plot No.21, Pragathi Nagar, Behind Vidya Nagar Colony, Rangareddy District, Telangana State.
పై కనపరచిన L.R. పిటిషన్‌లో 3వ J.Dr కు నోటీసు నిమిత్తం తేది. 28.03.2025న ఉదయం 10.30 గంటలకు పై కనిన 3వ J.Dr రు పై కనిన కోర్టులో హాజరై సమాదానం చెప్పుకోవలసినదిగా కోర్టువారు వాయిదా వేసియున్నారు. రాని యెడల పరోక్షముగా తీర్మానించబడును.
వాయిదా తేది: 28.03.2025
పి.ప్రభాకర నాయుడు
అడ్వకేట్, తిరుపతి

In the Court of the Addl. Senior Civil Judge: Tirupati
E.A.No. 237/2024,
O.E.P. No. / 2024
O.S.No.168/1984
M.Venkatamuni Reddy (died) & Others ...D.Hrs
Vs.
V.Venkatamuni Chetty (died) & Others ..J.Drs
NOTICE TO The J.Dr. No.3
Jdr.3) G.Jyothi W/o G.Narasimha Rao, D.No.4-2-52, Plot No.21, Pragathi Nagar, Behind Vidya Nagar Colony, Rangareddy District, Telangana State.
పై కనపరచిన L.R. పిటిషన్‌లో 3వ J.Dr కు నోటీసు నిమిత్తం తేది. 28.03.2025న ఉదయం 10.30 గంటలకు పై కనిన 3వ J.Dr రు పై కనిన కోర్టులో హాజరై సమాదానం చెప్పుకోవలసినదిగా కోర్టువారు వాయిదా వేసియున్నారు. రాని యెడల పరోక్షముగా తీర్మానించబడును.
వాయిదా తేది: 28.03.2025
పి.ప్రభాకర నాయుడు
అడ్వకేట్, తిరుపతి

రూ.1,468.94 కోట్లు విడుదల చేయాలి

- కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషిని కోరిన సిఎం, మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

2014-15 సంవత్సరానికి సంబంధించి సేకరించిన ధాన్యం బకాయిలు రూ.1,468.94 కోట్లను విడుదల చేయాలని సిఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోసిని వారు కలిశారు. అదే విధంగా ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సిఎంఆర్ డెలివరి గడువును పొడిగించాలని కేంద్ర మంత్రిని కోరారు.

ఇంజనీరింగ్ ఫీజులను పెంచొద్దు

- టిఎఎఫ్ఆర్‌సి హడావుడిగా విచారణ చేయొద్దు
- ఆడిట్ నివేదికలను సునిశితంగా పరిశీలించాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రానున్న మూడేండ్ల కాలానికి ప్రయివేటు ఇంజనీరింగ్‌తోపాటు వృత్తి విద్యా కోర్సుల కళాశాలల్లో ఫీజుల పెంపు కోసం తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టిఎఎఫ్ఆర్‌సి) హడావుడిగా విచారణ చేయొద్దని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఇంజనీరింగ్ ఫీజులను పెంచొద్దని కోరింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాలేజీల ఆడిట్ నివేదికలను సునిశితంగా పరిశీలించాలని సూచించారు. గత ఫీజుల కోసం లక్షలాది రూపాయలు పెంచుకొని కనీస సదుపాయాలను కాలేజీలు కల్పించలేదని విమర్శించారు. నకిలీ ఆడిట్ నివేదికలను సమర్పించి, కోర్సులు కొత్తగా వచ్చాయనీ, తరగతులు పెంచామనీ, జీతాలు, మౌలిక వసతులు పెరిగాయనే పేరుతో, ల్యాబ్, లైబ్రరీ, పుస్తకాల కొనుగోలు, లెక్చరర్స్ జీతాలు ఎక్కువ ఇచ్చినట్టు చూపించి, తర్వాత వారినుంచి తీసుకుంటున్నారని తెలిపారు. ఆయా ఖర్చులు వివరాలు తప్పులు ఇచ్చి కాలేజీలు ఫీజులు పెంచుకోవాలని చూస్తున్నాయని పేర్కొన్నారు. ఈ వివరాలుపై క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఫీజుల పెంపు నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. సక్రమంగా ఆడిట్ చేసి, కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించిన తర్వాతే ఫీజుల పెంపు ఆలోచన చేయాలని సూచించారు. గతంలో కూడా హడావుడి విచారణ చేసి, భారీగా ఫీజులను పెంచి, మళ్లీ తగ్గించడంతో కొన్ని కళాశాలలు విద్యార్థులను వేధించాయని గుర్తు చేశారు. విద్యార్థులకు నష్టం చేసే చర్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బి-కేటగిరి ప్రవేశాలను కూడా ఆన్‌లైన్ ద్వారా భర్తీ చేసి అక్రమ పద్ధతిలో డొనేషన్లు తీసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజులను ఏకపక్షంగా పెంచితే ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు.

బిజెపి, టిఎంసి మైత్రితో ప్రజాస్వామ్య హక్కులపై దాడులు

- లకింపూర్ ఘటనను తలదన్నేలా జాదవ్‌పూర్ ఘటన
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో బిజెపి, టీఎంసీ మైత్రితో ప్రజాస్వామ్య హక్కులపై దాడులు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు అన్నారు. కలకత్తాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీలో సమస్యలు పరిష్కరించాలని, విద్యార్థి సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని నిరసన తెలిపిన విద్యార్థులు, ఉపాధ్యాయులపైకి విద్యాశాఖ మంత్రి బ్రాత బసు కాన్వాయ్‌ను పోనిచ్చి గాయపరచడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది లకింపూర్‌లో రైతులపైకి బిజెపి నేత కారును ఎక్కిచ్చిన ఘటనను తలదన్నేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం హైదరాబాద్ నారాయణగూడ సెంటర్‌లో నిరసన తెలిపి, బెంగాల్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రైతు ఆందోళన నేపథ్యంలో లఖింపూర్ ఖేరీలో రైతులపైకి కాన్వాయ్ ముందుకు కదిలించి బిజెపి ఎలాగైతే ప్రాణం తీసిందో.. అదే తరహాలో బెంగాల్ విద్యాశాఖ మంత్రి జాదవ్‌పూర్ యూనివర్సిటీలో విద్యార్థులపైకి కాన్వాయ్ ముందుకు కదిలించి తీవ్రంగా గాయపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్ టిఎంసి ప్రభుత్వం కనీసం ప్రజాస్వామ్యం లేకుండా, విద్యార్థి సంఘాల ఎన్నికలు రద్దు చేయాలనే కుట్రతో నిర్లక్ష్యం చేసిందన్నారు. సమస్యలు పరిష్కరించకుండా.. విద్యార్థుల సమస్యపై మాట్లాడానికి ప్రతినిధులను ఎన్నుకునే హక్కులు లేకుండా చేస్తోందన్నారు. విద్యార్థుల, ఉపాధ్యాయులు కలిసి ఆందోళనలు చేస్తుంటే అణచివేయడానికి పూనుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు, పారా మిలటరీ ఉపయోగించి, విద్యార్థులపై కేసులు నమోదు చేసి క్యాంపస్‌లో భయానక పరిస్థితి సృష్టించిందని చెప్పారు. తక్షణమే ఈ ఘటనపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించాలని, విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్ గువేరా, అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షులు రమ్య, నాగేందర్, స్టాలిన్, సహాయ కార్యదర్శులు శ్రీమాన్, జిల్లా కమిటీ సభ్యులు సుష్మా, నవీన్, సాగర్, అఖిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రెండు దఫాలా? ఒకేసారా?

- అసెంబ్లీ సమావేశాలపై తర్జనభర్జన
- రేపు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
- ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత, బడ్జెట్‌పై చర్చించనున్న కేబినెట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి కుల గణనతోపాటు ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించటం, రాబోయే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రతిపాదించటం... రాష్ట్ర ప్రభుత్వానికి రాబోయే రెండు మూడు వారాల్లో ఇవి కీలకాంశాలు. ఇందుకోసం అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలి. ఈ మేరకు ఇటీవలే శాసనసభ, మండలిని ప్రొరోగ్ చేస్తూ గవర్నర్ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల మొదటి వారంలోనే అసెంబ్లీని సమావేశపరుస్తారని అందరూ భావించారు. కానీ ఆ దిశగా ప్రభుత్వంలో ఇప్పటిదాకా కదలికల్లేకపోవటం గమనార్హం. ముఖ్యమంత్రి రేవంత్ ఉన్నత స్థాయి సమీక్షలు, ఢిల్లీ పర్యటనలతో బిజీగా ఉండగా, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, జూపల్లి తదితరులు ఎస్-ఎల్‌బిసి టన్నెల్ ప్రమాదానికి సంబంధించిన సహాయక చర్యలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క... బడ్జెట్‌కు ముందు వివిధ శాఖలతో నిర్వహించే ప్రతిపాదిత సమావేశాలతో బిజీగా ఉన్నారు.

వాస్తవానికి కులగణన, ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు వీలుగా ఈనెల మొదటి వారంలోనే అసెంబ్లీని నిర్వహిస్తామంటూ ప్రభుత్వం గత నెలాఖరులో ప్రకటించింది. అందుకనుగుణంగా కేబినెట్ భేటీ ఉంటుందని తెలిపింది. ఆ మేరకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించనున్నారు. కులగణన, ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత, దానికి న్యాయపరంగా ఎలాంటి చిక్కుల్లేకుండా చూసుకోవటం తదితరాంశాలపై కేబినెట్‌లో కూలకుశంగా చర్చిస్తారని సమాచారం. ఆ తర్వాత ఈ రెండింటి చట్టబద్ధత కోసం త్వరలోనే (ఈనెల పదిలోపు) అసెంబ్లీని సమావేశపరుస్తారని ఒక అధికారి తెలిపారు. ఈ రెండింటికీ అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించిన తర్వాత సభను ఒక వారంపాటు వాయిదా వేస్తారని సమాచారం. అనంతరం సిఎం ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలుస్తారనే చర్చలు కూడా కొనసాగుతున్నాయి. కులగణన, ఎస్‌సి వర్గీకరణపై తాము తీర్మానం చేసిన దరిమిలా...కేంద్రం కూడా పార్లమెంటులో ఆ మేరకు తీర్మానించాలంటూ ఆయన ప్రధానిని కోరనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈనెల 10 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో దానికి కొద్ది రోజులు అటుఇటుగా (15 నుంచి 20లోపు) మళ్లీ అసెంబ్లీని సమావేశపరిచి బడ్జెట్‌ను ప్రతిపాదించేందుకు సిఎం సమాలోచనలు చేస్తున్నారని వినికిడి. అయితే వీటన్నింటికి సంబంధించి అటు అసెంబ్లీ వర్గాల నుంచి గాని, ఇటు ముఖ్యమంత్రి కార్యాలయం వైపు నుంచి గానీ ఎలాంటి స్పష్టత రాలేదు. గురువారం నాటి కేబినెట్ తర్వాత దీనిపై మరింత క్లారిటీ వచ్చే అవకాశముంది.

'గాంధీ' వైద్యులపై మంత్రి సీరియస్

- దుమ్మా డాక్టర్లకు నోటీసులివ్వాలని ఆదేశాలు
- గాంధీ ఆస్పత్రిలో మంత్రి దామోదర రాజనర్సింహ ఆకస్మిక తనిఖీలు

గాంధీ ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గాంధీ ఆస్పత్రి డాక్టర్లపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సీరియస్ అయ్యారు. ముందస్తు సమాచారం లేకుండా డ్యూటీకి గైర్హాజరైన డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో మంత్రి దామోదర రాజనర్సింహ్మ మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. నేరుగా ఔట్ పేషెంట్ వార్డుకు వెళ్లి రోగులతో మాట్లాడారు. డాక్టర్ల అటెండెన్స్ షీట్ తెప్పించుకుని పరిశీలించారు. ఒపిలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. దుమ్మా డాక్టర్లకు షోకాజ్ నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని డిఎంఇ, హాస్పిటల్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. గాంధీలో ఒపి, ఐపి, ఎంసిహెచ్, ఐవిఎఫ్, ఒపి డయాగ్నస్టిక్ సర్వీసెస్, స్కానింగ్ వార్డులను మంత్రి పరిశీలించారు. ఐవిఎఫ్ సేవల్లో జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత డాక్టర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డిఎంఇని ఆదేశించారు. విధులకు గైర్హాజరైన డాక్టర్లపై చర్యలుంటాయని, డాక్టర్లు, ప్రొఫెసర్లు, ఆర్ఎంఒలు దుమ్మా కొడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గాంధీలో వైద్య సేవలపై త్వరలో సీరియస్ రివ్యూ చేస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ఎక్కడా రోగులకు ఇబ్బందులు కలుగొద్దన్నారు. వైద్యులు సకాలంలో డ్యూటీకి రావాల్సిందేనన్నారు. వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చూస్తామని, అన్ని ఆస్పత్రులపై నిరంతరం నిఘా పెట్టామని చెప్పారు. మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు

త్వరలో గల్ఫ్ అమరుల సభ

- మాజీ ఎమ్మెల్యే అనిల్ ఈరవత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలతో త్వరలో 'గల్ఫ్ అమరుల సభ'ను నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి వెల్లడించారు. అమరుల కుటుంబాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహపంక్తి భోజనం చేయనున్నారని ఒక ప్రకటనలో తెలిపారు. 'చనిపోయిన వారిని స్మరించండి... బతికున్న వారి కోసం పోరాడండి' అనే స్ఫూర్తితో గల్ఫ్ దేశాల్లో ఏ కారణంగా చనిపోయినా... విధి నిర్వహణలో మరణం (ఆన్ డ్యూటీ డెత్)గా పరిగణించి రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తున్నదని తెలిపారు. భారత దేశ సరిహద్దులు దాటి ఎడారి దేశాల్లో పనిచేస్తూ మరణించిన కార్మికులు సైనికుల్లాంటి వారని తెలిపారు. విదేశీ మారక ద్రవ్యాన్ని పంపిస్తూ ఆర్థిక జవాన్లుగా సేవలందించిన వారిని 'గల్ఫ్ అమరులు' గా స్మరించుకోవాలని సిఎం సూచించారని గుర్తు చేశారు. ఇప్పటి వరకూ 94 మంది గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.ఐదు లక్షల చొప్పున రూ.4.70 కోట్ల ఎక్స్‌గ్రేషియా చెల్లించామని పేర్కొన్నారు.

మే 4న నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్లకు సిఎస్ శాంతికుమారి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మే నాలుగో తేదీన జరగనున్న జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) శాంతికుమారి ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో రాష్ట్రానికి మంచి ట్రాక్ రికార్డు ఉందని, మౌలిక సదుపాయాలు, తగిన భద్రతా ఏర్పాట్లు ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించి నీట్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి నీట్ పరీక్ష ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఎస్పిలు, సిపిలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఆమె సమీక్షించారు. కేంద్రీయ విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు వంటి ప్రభుత్వ భవనాలను వెంటనే గుర్తించి పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

భూ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) పురోగతిని కూడా సిఎస్ శాంతికుమారి సమీక్షించారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లను ఆమె ఆదేశించారు. ఈనెల 31 వరకు క్రమబద్ధీకరణ రుసుము చెల్లించిన దరఖాస్తులకు రిబేట్ (రాయితీ)పై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. గతంలో నామమాత్రపు ఫీజులు చెల్లించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి ఆ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని కూడా పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, లా అండ్ ఆర్డర్ ఎడిజిపి మహేశ్ భగవత్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవీ నరసింహారెడ్డి, వైద్య విద్య సంచాలకులు నరేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
H.M.O.P NO: 35/2024
చెన్ను చంద్ర శేఖర్ ...పిటిషనర్
వర్సస్
1) చెన్ను సవిత అలియాస్ సి.సుమతి అలియాస్ నాగలపాటి సవిత
2) గొంగటి అజయ్ కుమార్ ...రెస్పాండెంట్స్
టు,
R1 రెస్పాండెంట్ వివరములు :
చెన్ను సవిత అలియాస్ సి.సుమతి అలియాస్ నాగలపాటి సవిత (R1)
భర్త చెన్ను చంద్రశేఖర్, వయస్సు 37 సం.లు, ఇంటి నెం 1-6-77/ఎ, రామాలయం దగ్గర, చైతన్యపూరి, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.
పై H.M.O.P No అనగా H.M.O.P No: 35/2024 లో కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిన మీరు తీసుకొనక కాలయాపన చేస్తున్నందున కోర్టు వారు సదరు H.M.O.P లో 11-03-2025వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున మీరు పైన తేదీన ఉదయం గం 10.30 నిమిషాలకు మీరు స్వయముగా గానీ లేదా మీ వకీలు ద్వారా గానీ కోర్టుకు హాజరయ్యి మీ అక్షేపణలు ఉన్న యెడల పైన తేదీన తెలియజేసుకొనవలెను. అట్లు తప్పిన యెడల మీ పై కోర్టువారు సదరు పిటిషన్ ను పరోక్షంగా విమర్శించి తీర్మానించెదరని తెలియజేయడమైనది.
// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
మార్కాపురం
తేదీ: 04-03-2025
ఇట్లు
జి.చౌడేశ్వర రావు, న్యాయవాది, మార్కాపురం
బి.ఐజాక్, పి లావణ్య , న్యాయవాదులు, గిద్దలూరు.
సెల్ 8639368889

IN THE COURT OF THE HON'BLE XXI JUINOR CIVIL JUDGE CITY CIVIL COURT: AT: HYDERABAD
OS No 786 of 2025
BETWEEN:
Vanga Sita Kumari & Ors ...Plaintiffs
AND
1.The Tahsildar, Mandal Revenue Office, Shaikpet,
2. All Concerned ...Defendants
Whereas the above named Plaintiffs filed Suit for declaration of legal heirs of deceased **Late: Vanga Jayarami Reddy** on the file of the Hon'ble **XXI Junior Civil Judge, City Civil Court, at Hyderabad** and the above mentioned case is posted to 25-03-2025 at 10.30 AM for appearance before Hon'ble **XXI Junior Civil Judge, City Civil Court, Hyderabad.** Anyone who are the legal heirs of **Late Vanga Jayarami Reddy** are hereby directed by the above mentioned court to appear either in person or through pleader with instructions if any on the said date and time mentioned above. Falling which the case will be heard and determine ex-parte.
//BY ORDER OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD.
Sd/-
N. VIJAYA SARADHI, SHAIK. ZAHEERUDDIN, ADVOCATES
Flat No 402, 4 th Floor, Rajya Lakshmi Bhavan, Opp: Sai Chaitanya Techno School, Parvat Nagar, Hyderabad – 500018

విద్యుదాఘాతానికి యువకుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వాగులో చేపలు పట్టేందుకు వెళ్లిన యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని పురుషోత్తమాయగూడెం వద్దనున్న ఆకేరు వాగులో మంగళవారం జరిగింది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. పురుషోత్తమాయ గూడెం గ్రామానికి చెందిన జర్పుల కోట-అరుణ దంపతులకు సందీప్, శశి (20) ఇద్దరు కుమారులు ఉన్నారు. దంపతులు వ్యవసాయ కార్మికులుగా జీవనం సాగిస్తుండగా కుమారులు చదువుకుంటున్నారు. కాగా చిన్న కుమారుడు ఇంటర్ పూర్తి చేసి ఇంటివద్దే ఉంటున్నారు. ఈ క్రమంలో శశి వారి బంధువులతో కలిసి గూడెం సమీపంలోని ఆకేరు వాగులో చేపలు పట్టేందుకు వెళ్లారు. శశి.. కరెంటు తీగతో చేపలు పట్టేందుకు ప్రయత్నించగా అది విఫలమై విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు.

టీచర్ల గొంతుకగా పనిచేస్తా

- ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తనపై విశ్వాసంతో విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, కలిసి పనిచేసిన మిత్రులకు వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది ఉపాధ్యాయులందరి విజయమని పేర్కొన్నారు. తనకు వచ్చిన ఈ అవకాశాన్ని ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం వినియోగిస్తానని తెలిపారు. శాసనమండలిలో ఉపాధ్యాయుల గొంతుకగా పనిచేస్తానని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ సమస్యలను ఏ సమయంలోనైనా తన దృష్టికి తేవచ్చని కోరారు. అన్ని వేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. తన నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను కలిసే ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. తనకున్న అను భవాన్ని రాష్ట్ర విద్యాభివృద్ధికి వినియో గిస్తానని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా రాష్ట్ర విద్యా వ్యవస్థలోనూ సరికొత్త మార్పులను తెచ్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన విజయానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరినీ స్వయంగా త్వరలోనే కలుస్తానని తెలిపారు. పిఆర్‌టియుటిఎస్ నాయకుడిగా ఇంతకాలం ఉపాధ్యాయులతో మమేకమయ్యాననీ, ఇక ముందు కూడా విద్యారంగ నిపుణులు, టీచర్లు, మేధావుల అభిప్రాయాలను చట్టసభల్లో వినిపిస్తానని పేర్కొన్నారు.

కులగణన సర్వే, ఎస్‌సి వర్గీకరణ చారిత్రాత్మక నిర్ణయాలు

- మెదక్ లోక్‌సభ నియోజకవర్గ సమీక్షలో మహేష్‌కుమార్ గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కులగణన సర్వే, ఎస్‌సి వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నదని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. ఇది దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన మెదక్ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ నేతలతో ఆయన సమీక్షించారు. ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డిసిసి అధ్యక్షులు, పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీ అనుబంధ సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 14 నెలల ప్రజాపాలనలో నియోజకవర్గ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సంస్థాగతంగా పార్టీ నిర్మాణం, కమిటీల ఏర్పాటు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. పాత, కొత్త నేతల మధ్య సమన్వయం లోపించకుండా చూడాలన్నారు. ఐక్యతతో ముందుకు సాగాలని హితవు పలికారు. పార్టీ లైన్ దాటితే ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అందరినీ కలుపుకుపోవాలని సూచించారు. నియోజక వర్గ ఎమ్మెల్యేలు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. ఆ తర్వాత మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం సమీక్ష నిర్వహించారు.

మినీ అంగన్‌వాడీల పెండింగ్ జీతాలు చెల్లించాలి

- పిఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలి
- బేగంపేట మెట్రో నుంచి ప్రజాభవన్ వరకు ర్యాలీ
- మూడు దఫాలుగా అధికారుల చర్చలు
- త్వరలో జీతాలతో పాటు ఇతర సమస్యలు పరిష్కరిస్తామని హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మినీ అంగన్‌వాడీల పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది అంగన్‌వాడీలు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు తరలి వచ్చారు. సిఐటియు అనుబంధ సంఘమైన తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి ర్యాలీగా తరలి వచ్చారు. మెట్రో దాటిన తర్వాత వారిని పోలీసులు మధ్యలో అడ్డుకునే ప్రయత్నం చేశారు. దాంతో పోలీసులకు, అంగన్‌వాడీలకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ప్రజావాణికి వెళ్ళనీయకపోతే రోడ్డుపైన బైఠాయిస్తామని తెగేసి చెప్పడంతో పోలీసులు అనుమతిచ్చారు. ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసే పిఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలనీ, మొబైల్ సెంటర్లను ఎత్తేయాలనీ, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయొద్దని డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఒకటవ తేదీన వేతనాలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, టీచర్లు, హెల్పర్లను రెగ్యులర్ చేయాలనీ, కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీల ప్రకారం రూ.18 వేల వేతనం పెంచడంతో పాటు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ప్ల కార్డులు, జెండాలు పట్టుకుని నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఈ సందర్భంగా వారు ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌కు అందజేశారు. ఇన్‌చార్జీ చిన్నారెడ్డితో పాటు పలువురు అధికారులు మూడు దఫాలుగా అంగన్‌వాడీలతో ప్రజాభవన్లో చర్లలు జరిపారు. అనంతరం అధికారులు వారికి నిర్దిష్టమైన హామీలు ఇచ్చారు. మినీ అంగన్‌వాడీ టీచర్లకు 10 నెలల పెండింగ్ వేతనాలు చెల్లిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల తంతు అయిపోయిన వెంటనే జీవోను జారీ చేస్తామనీ, వారికి హెల్పర్లను నియమించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తామని హామీ ఇచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న ప్రభుత్వం ప్రకటించే అవకాశముందని వారికి అధికారులు వివరించారు. పదవి విరమణ పొందిన వారికి షరతులు లేకుండా ఆసరా పెన్షన్ వచ్చే విధంగా ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేస్తామనీ, ఉద్యోగంలో కొనసాగుతున్న వారికి ఆసరా పెన్షన్ ఇవ్వడం కోసం ఉన్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు. ఇతర డిమాండ్లను ప్రభుత్వంతో చర్చించి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, కోశాధికారి పి. మంగ, రాష్ట్ర ఆఫీష్ బేరర్లు సమ్మక్క, కోటేశ్వరి, రాష్ట్ర నాయకులు వెంకటమ్మ, ఏసు, మణి తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణి నోడల్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై నివేదిక

- బిసి కమిషన్ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ జిల్లాలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఆందోళనకరమని బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. ఆ జిల్లాలోని కొత్తగడి సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఉపాధ్యాయుల వేధింపులతో సబిత అనే పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం విదితమే. ఆ ఘటనను సిరీయస్‌గా తీసుకున్న బిసి కమిషన్, వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి అలుగు వర్షినికి మంగళవారం లేఖ రాశారు. ఈ సంఘటనపై విచారణ జరిపి పది రోజుల్లోపు కమిషన్‌కు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలో తరచుగా ఇలాంటి సంఘటనలు జరగడం ఆందోళనకరమని తెలిపారు. సరైన కారణాలను తెలుసుకుని దిద్దుబాటు చర్యలు తెలుసుకొనే విధంగా ప్రయత్నాలు చేపట్టాలని సూచించారు.

అటకెక్కిన క్రిస్టియన్ భవన్ నిర్మాణ పనులు

- తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ సర్కార్ క్రిస్టియన్ ఆత్మ గౌరవ భవన నిర్మాణ పనులను అటకెక్కించిందని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉప్పల్ భగాయత్‌లో నిర్మాణంలో ఉన్న క్రిస్టియన్ భవన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజీవ్ సాగర్ మాట్లాడుతూ...బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు క్రిస్టియన్ల ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలని ఉప్పల్ భగాయత్‌లో రెండు ఎకరాల స్థలం కేటాయించి రూ.10 కోట్లు భవన నిర్మాణానికి మంజూరు చేసిందని గుర్తుచేశారు. బిఆర్ఎస్ పార్టీకి పేరు వస్తుందనే అక్కసుతో కాంగ్రెస్ సర్కారు నిర్మాణ పనులు ఆపేసిందని విమర్శించారు. వెంటనే నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం త్వరతగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది బడ్జెట్‌లో మైనార్టీలకు రూ. నాలుగు వేల కోట్లు కేటాయించాలన్నారు. నిరుద్యోగ మైనార్టీ యువత, మహిళలకు సబ్సిడీ రుణాలను అందించడానికి సంవత్సరానికి రూ. 1,000 కోట్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అలాగే పాస్టర్లకు నెలకు రూ. 12 వేల గౌరవ వేతనం ఇస్తామని మత పెద్దలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన కులగణనలో ఉద్దేశపూర్వకంగానే క్రిస్టియన్ల జనాభా చూపించకుండా మోసం చేసిందని విమర్శించారు. క్రిస్టియన్ల జనాభా తెలంగాణలో లేనట్టు అసలు క్రిస్టియన్ శాతాన్నే చూపించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే రీ సర్వే చేసి క్రిస్టియన్ల జనాభాను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ భూముల అమ్మకానికి సర్కారు కుట్ర

- నాడు సుద్దులు... నేడు టెండర్లు
- అసెంబ్లీని సైతం తప్పుదోవ పట్టించిన వైనం : హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ భూముల అమ్మకానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా ప్రజలను తప్పుదోవ పట్టించిన సర్కార్ వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. "ప్రభుత్వ భూములంటే పెద్దలిచ్చిన ఆస్తి. తెలంగాణ జాతి సంపద. ఆ భూములను అమ్మితే భవిష్యత్‌లో స్మశానాలు నిర్మించాలంటే కూడా భూమి లేకుండా పోతుందని నాడు పిసిసి అధ్యక్షుడి హోదాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొసలి కన్నీరు కార్చిండు. తాము అధికారంలోకి వస్తే ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోమంటూ ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసిండు. ప్రస్తుతం రూ.20 వేల కోట్ల విలువైన భూములను వేలం వేసేందుకు తెరలేపిండు" అని హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. నిధుల సమీకరణ పేరుతో భూములను కారు చౌకగా అమ్ముతుండటం కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని ఆరోపించారు. మాస్టర్ ప్లాన్ పేరిట వేలం పాట నిర్వహించేందుకు కన్సల్టెంట్ నియమకానికి (ఆర్ఎఫ్‌పి) గత నెల 28న టెండర్లు పిలవడం ప్రభుత్వ దిగజారుడు తనానికి పరాకాష్ట అని వ్యాఖ్యానించారు. "కంచ గచ్చిబౌలి గ్రామం సర్వే నంబర్ 25 పరిధిలోని 400 ఎకరాలను బ్యాంకర్లకు తనఖా పెట్టిన సమయంలో ప్రభుత్వం రూ. 25 కోట్లకు ఎకరం చొప్పున రూ.10వేల కోట్లు ఇప్పటికే సమీకరించింది. బ్యాంకులో తనఖా పెట్టిన అవే భూములనే వేలం వేసి అమ్ముకోవడం ప్రభుత్వ దివాలాకోరు తనానికి నిదర్శనం" అని ఆయన విమర్శించారు.

అసెంబ్లీని తప్పుదోవ పట్టించారు.

"జూన్ 26, 2024న విడుదల చేసిన జీవో ఎంఎస్ 54తో ఎకరానికి రూ. 75 కోట్ల చొప్పున మొత్తం 30 వేల కోట్ల విలువైన భూములను అమ్ముతున్నారని నేను అసెంబ్లీలో నిలదీస్తే.. అలాంటిదేమి లేదని, టిజిఐఐసికి చేస్తున్న భూ బదలాయింపు మాత్రమేనని బుకాయించారు. నిండు సభలో ముఖ్యమంత్రి సహా మంత్రులు తప్పుడు సమాధానం చెప్పి, సభను, సభ్యులను తప్పుదోవ పట్టించారు. అసెంబ్లీ అయ్యిందో, లేదో వెంటనే అదే భూమిని తనఖా పెట్టి రూ. 10 వేల కోట్ల రుణం తెచ్చుకున్నరు. తిరిగి అసెంబ్లీ మొదలయ్యే లోపే ఇప్పుడు అదే భూమిని అమ్మకానికి టెండర్లు పిలుస్తున్నారు. భూముల అమ్మకంపై అసెంబ్లీని తప్పుదోవ పట్టించారు. సర్కార్ భూముల అమ్మకం ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలి" అని హరీశ్ డిమాండ్ చేశారు.

ధనబలం ముందు ఓడిన ఉపాధ్యాయుల ఆత్మగౌరవం : టిఎస్‌పిటిఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో జరిగిన శాసనమండలి ఎన్నికల్లో ధనబలం, ప్రలోభాల ముందు ఉపాధ్యాయుల ఆత్మగౌరవం ఓడిపోయిందని టిఎస్‌పిటిఎ అభిప్రాయపడింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ షౌకత్‌అలీ, ఆర్ రోహిత్ నాయక్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఇలాంటి పరిణామాలు ఉపాధ్యా యుల విశాల ప్రయోజనాలు హరిస్తాయని తెలిపారు. గడిచిన పదేండ్లుగా ఉపాధ్యాయ లోకం ఎంతో కోల్పోయిందని పేర్కొన్నారు. వాటిని నిలబెట్టిన అమరుల త్యాగాలను, పోరాటాలను ప్రస్తుత ఫలితాలు అపహాస్యం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు ఉపాధ్యాయ నియోజకవ ర్గాల్లో ఉపాధ్యాయుల ఆత్మగౌరవం దెబ్బతీసిన టీచర్లు ఆత్మవిమర్శ చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి ప్రజా స్వామ్య, గణతంత్ర శక్తులు ఐక్యంగా నిలబడాలని సూచించారు.

రాజకీయాల్లో యువత రాణించాలి

- 'యంగ్ ఇండియా కీ బోల్'లో శివచరణ్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేటి యువత రాజకీయాల్లోకి రావడమే కాకుండా రాణించాలని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన 'యంగ్ ఇండియా కీ బోల్ - సీజన్ 5 రాష్ట్రస్థాయి కాంపిటేషన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, ఏఐసీసీ సభ్యులు కోట నీలిమా, సీనియర్ జర్నలిస్టు పిల్లలమర్రి శ్రీనివాస్, రాష్ట్ర ఇన్‌చార్జి సురభి ద్వివేది, యంగ్ ఇండియా కీ బోల్ రాష్ట్ర ఇన్‌చార్జి నీతు తదితరులు పర్యవేక్షించారు. నౌక్రి దో నషా నహి అంటూ రాష్ట్ర ఫైనల్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నిజాంపేటలో ఆక్రమణల తొలగింపు

- ఏడెనిమిది కాలనీలకు తొలగిన ట్రాఫిక్ ఇబ్బందులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నిజాంపేట మున్సిపాలిటీలో వార్డ్ నంబర్ 12లోని బాలాజీహిల్స్, ఇందిరమ్మ కాలనీ రహదారుల ఆక్రమణలను మంగళవారం హైడ్రా తొలగించింది. రహదారులను ఆక్రమించి నిర్మించిన అపార్ట్‌మెంట్ ర్యాంపులు, రోడ్డు మీదకు జరిపి మొక్కల కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌లను, పై అంతస్తులకు చేరేందుకు ఏర్పాటు చేసిన ఐరన్ ఫ్రేమ్ మెట్లను హైడ్రా తొలగించింది. ఇందిరమ్మ కాలనీలో రహదారులను ఆక్రమించి దుకాణాల ఏర్పాటు, అదనంగా గదులు నిర్మించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని హైడ్రాకు ఫిర్యాదులందాయి. ముఖ్యంగా వెంకటరాయ నగర్, బాలాజీ కాలనీ, కెఎన్ఆర్ కాలనీ, కొలను తులసి రెడ్డి (కెటిఆర్) కాలనీలకు వెళ్లే దారిలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతోందని హైడ్రాకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఓల్డ్ ఏజ్ హోం నుంచి మియాపూర్ మెట్రో స్టేషన్‌కు నిజాంపేట రహదారుల మీదుగా వెళ్లే వాహనాలతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఫిర్యాదు రావడంతో కిలో మీటరుకు పైగా ఆక్రమణలు తొలగించారు. ఆక్రమణలను తొలగించాలని సదరు నిర్మాణదారులకు రెండు నెలలు గడువు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో నిజాంపేట మున్సిపల్ అధికారుల సమక్షంలో హైడ్రా చర్యలు తీసుకుంది. బాలాజీ హిల్స్ కాలనీలోని పలు రహదారులతోపాటు ఇందిరమ్మ కాలనీ దారుల్లోనూ కబ్జాలను తొలగించారు. కూల్చివేతలకు స్థానికులు, కాలనీవాసులు సహకరించారు. అక్రమ నిర్మాణాలతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ ఇందిరమ్మ కాలనీ వాసులకు హైడ్రా అధికారులు నచ్చజెప్పారు. మెట్రో రైలుతోపాటు, ప్రధాన రహదారికి సులభంగా చేరుకునే అవకాశం లభించందంటూ బాలాజీ హిల్స్ కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. దీనిపై బాలాజీ హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు చిరంజీవి మాట్లాడుతూ.. "రహదారుల ఆక్రమణలపై రెండున్నరేళ్లుగా పోరాడుతున్నాం. కోర్టును కూడా ఆశ్రయించాం. ఆక్రమణలను తొలగించాలని కోర్టు తీర్పు కూడా ఉంది. మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా ప్రయోజనం లేకపోయింది. హైడ్రాను ఆశ్రయించాం. వెంటనే విచారణ చేపట్టిన హైడ్రా.. ఆక్రమణదారులకు రెండు నెలల కిందట నోటీసులు ఇచ్చింది. ఎవరూ స్పందించకపోవడంతో కూల్చివేతలు చేపట్టారు" అని తెలిపారు.

ఆర్‌డిఒ, తహసీల్దార్లతో మాట్లాడుతున్న రైతులు

మామునూర్ ఎయిర్‌పోర్ట్ భూ సర్వే

- ఆర్‌డిఒ, తహశీల్దార్లను అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మామునూర్ ఎయిర్‌పోర్ట్ భూ సర్వేకి వచ్చిన ఆర్‌డిఒ సత్యపాల్ రెడ్డి, ఎమ్మార్వో నాగేశ్వర రావు, రెవెన్యూ అధికారులను రైతులు అడ్డుకున్నారు. సరైన పరిహారం, ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాలు చూపెట్టిన తర్వాతే సర్వే నిర్వహించాలని రైతులు డిమాండ్ చేశారు. సర్వే ఆపి వెళ్లిపోవాలని 200 మంది రైతులు ఆందోళన చేపట్టారు. అదేవిధంగా ఎయిర్‌పోర్ట్‌కు భూమి కోల్పోతున్న రైతులు తమ ఊరికి వచ్చే రోడ్డుకి ప్రత్యామ్నాయ రోడ్డు కావాలని గుంటూరు పల్లి, గాడిపెల్లి రైతులు కోరారు. మార్కెట్ ధరకి తగినట్టుగా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీగా పోలీసులు మోహరించారు. ధర్నాకు అనుమతి లేదని రైతులతో పోలీసులు వాదించారు.

ఎన్నికల్లో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు : టిపిటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీచేసిన టిపిటిఎఫ్ అభ్యర్థి వై అశోక్ కుమార్‌కు నెలరోజులపాటు సహకరించిన ప్రతిఒక్కరికీ తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రచార అంశాలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచురించి, ప్రసారం చేసిన మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. మద్దతు తెలిపిన ఎమ్మెల్సీలు కోదండరామ్, అలుగుబెల్లి నర్సిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రియాజ్, టివివి అంబటి నాగయ్యకు కృతజ్ఞతలు ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతిరోజూ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న పౌర, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అశోక్‌కుమార్‌కు మద్దతిచ్చిన టీఎస్‌యూటీఎఫ్‌తోపాటు ఇతర ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల నాయకులు, కార్యకర్తలు ధన్యవాదాలు తెలిపారు.

ఆదిలాబాద్ సిసిఐ ఫ్యాక్టరీని తుక్కుగా అమ్మేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర

- రాష్ట్ర ప్రయోజనాలు పట్టని బిజెపి : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ఫ్యాక్టరీని తుక్కు కింద తెగనమ్మేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సిద్ధమైందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సిసిఐని తిరిగి ప్రారంభిస్తామని పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చి, ఓట్లు దండుకున్న బిజెపి, ఆ సంస్థను స్క్రాప్ కింద అమ్మాలనుకోవడం ప్రజలను వంచించడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. "బిజెపి అంటే నమ్మకం కాదు... అమ్మకం" అని దుయ్యబట్టారు. ఆ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించాలని ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరసనలు, వారి ఆర్తనాదాలు కేంద్ర ప్రభుత్వానికి వినిపించడం లేదా అని కెటిఆర్ ప్రశ్నించారు. 772 ఎకరాల భూమి, 170 ఎకరాల టౌన్‌షిప్, 48 మిలియన్ టన్నుల లైమ్‌స్టోన్ నిల్వలతో సకల వనరులు కలిగిన ఈ సంస్థను అంగడి సరుకుగా మార్చిన పాపం మోడీ సర్కారుదేనని మండిపడ్డారు. విలువైన యంత్ర పరికరాలను పాత ఇనుప సామాన్ల కింద లెక్క కట్టి ఆన్‌లైన్‌లో అమ్మడానికి టెండర్లు పిలవడం బిజెపి ప్రభుత్వ దగుల్బాజీ తనానికి నిదర్శనమన్నారు. నిర్మాణ రంగంలో సిమెంట్‌కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సిసిఐని తిరిగి ప్రారంభించి కార్మికులను ఆదుకోవాలని పదుల సార్లు కేంద్ర మంత్రులను తమ ప్రభుత్వం కోరినా, కనీసం వారు కనికరించకపోవడం ఆదిలాబాద్ ప్రజలకు వెన్నుపోటు పొడవడమే అన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి సిసిఐని తిరిగి ప్రారంభించేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని కెటిఆర్ గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీతో మాజీ సిఎం కెసిఆర్ పలుమార్లు చర్చలు జరిపారని తెలిపారు. ఇంతేకాదు తానే స్వయంగా కేంద్ర మంత్రులైన నిర్మలా సీతారామన్, మహేంద్రనాథ్ పాండే, పీయూష్ గోయల్‌లను పలుమార్లు కలవడంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు కూడా రాశానని గుర్తుచేశారు. పబ్లిక్- ప్రయివేట్ భాగస్వామ్యం లేదా జాయింట్ వెంచర్ రూపంలో సిసిఐ యూనిట్‌ను తిరిగి తెరిచే విషయాన్ని పరిశీలిస్తామని 2016లో నాటి కేంద్ర భారీ పరిశ్రమలు, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ మంత్రి అనంత్ గీతే ప్రకటించారని కెటిఆర్ గుర్తుచేశారు. అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించి రాష్ట్ర ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినా.. బిజెపి ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాలేదని విమర్శించారు.

2018 ఎన్నికల ప్రచారంలో సిసిఐని తెరుస్తామని హామీ ఇచ్చిన బిజెపి, ఇప్పుడు ఆ సంస్థను స్క్రాప్‌గా అమ్మేందుకు ఆన్‌లైన్ టెండర్లు పిలవడం ఆదిలాబాద్ ప్రజలకు చేసిన మోసమేనని కెటిఆర్ ఆరోపించారు. అదిలాబాద్ వచ్చిన ప్రతి సందర్భంలో బిజెపి నాయకులు సిసిఐని తెరిపిస్తామని ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు. కేంద్ర మంత్రులు అమిత్ షా నుంచి మొదలుకుని హంసరాజ్ గంగారం వరకు ప్రతి ఒక్కరు ఎన్నికల్లో లబ్ధి కోసం సిసిఐ తెరిపిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు కార్మికులతో కలిసి ఉద్యమిస్తామని, సంస్థ పరిరక్షణ కోసం పోరాడతామని కెటిఆర్ ప్రకటించారు.

మీ-సేవా మేనేజర్ల తొలగింపు, బదిలీలు

- నచ్చిన వాళ్లకు ఇష్టమున్న చోటే పోస్టు
- తొలగించిన వారిలో 40 ఏళ్ల వయస్సు పైబడిన వారే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాంకేతికత ద్వారా సులభతరం చేయబడిన స్మార్ట్ పౌర-కేంద్రీకృత, నైతిక, సమర్థవంతమైన పాలనను అందించడమే మీసేవా లక్ష్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011 నవంబర్ 4న చిత్తూరు జిల్లాలో ప్రారంభించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర, కేంద్ర సేవలతో పాటు ప్రజా ప్రయోజన పత్రాల జారీ వంటి సేవల్ని మీసేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. మీ సేవా కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక పౌర సేవలందుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సేవలతో పాటు అనేక సేవలందుతున్నాయి. అలాంటి మీసేవా కేంద్రాల నిర్వహణను పర్యవేక్షించడం కోసం ప్రతి జిల్లాకో ఇడిఎం (డిప్యూటీ డిస్ట్రిక్ట్ మేనేజర్) డిఎం (డిస్ట్రిక్ట్ మేనేజర్)ను నియమించారు. విద్యార్హతలు, అనుభవాన్ని బట్టి ఇడిఎం, డిఎంల నియామకాలు జరిగాయి. అయితే ఇటీవల రాష్ట్రంలోని మెట్రోపాలిటన్ సిటీస్‌లో పనిచేస్తున్న జిల్లా మేనేజర్లను బదిలీ చేయడం, కొందర్ని తొలగించారు. బదిలీలు, తొలగింపు వ్యవహారంలో భారీ ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నట్టు విమర్శలొస్తున్నాయి.

మీసేవా కేంద్రాల పర్యవేక్షణ కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నియామకం చేసిన ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్లు, డిస్ట్రిక్ట్ మేనేజర్లు తెలంగాణలోనూ కొనసాగుతున్నారు. ప్రతి జిల్లాకు ఒకరు చొప్పున పనిచేస్తున్న వీరిని టిజిటిఎస్, టిఎస్ ఆన్‌లైన్ ద్వారా నియామకం చేశారు. ప్రస్తుత రిక్రూట్‌మెంట్ కూడా టిజిటిఎస్, టిఎస్ ఆన్‌లైన్ ద్వారానే కొనసాగుతుంది. రాష్ట్రంలో ఇటీవల కొందర్ని విధుల్లోంచి తొలగించారు. ఇంకొందర్నేమో దూరంగా ఉన్న జిల్లాలకు బదిలీ చేశారు. బదిలీ ప్రక్రియ నిబంధనల మేరకు జరగలేదనే విమర్శలున్నాయి. డిస్ట్రిక్ట్ మేనేజర్లు పనిచేస్తున్న జిల్లాల్లోని మీసేవా కేంద్రాల సంఖ్యల ఆధారంగా చేపట్టాలి. అనుభవం, సీనియార్టీని పరిగణించాలి.

అయితే ఇటీవల జరిగిన బదిలీల్లో మాత్రం నిబంధనలన్నీ పక్కన బెట్టినట్టు చెబుతున్నారు. టిజిటిఎస్ మీసేవా ప్రాజెక్టులోని ఇద్దరు ఉద్యోగులు, టిఎస్ ఆన్‌లైన్‌కి సంబంధించిన ఒక టీం లీడర్‌తో పాటు ఓ ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకుడు కలిసి బదిలీలు, తొలగింపుల వ్యవహారాన్ని చక్కదిద్దినట్టు చెబుతున్నారు. విపక్ష నేత సూచించిన మేరకు ప్రశ్నించే వాళ్లను, నచ్చని వాళ్లను దూర ప్రాంత జిల్లాలకు, నచ్చిన వాళ్లు, తమకు కావాల్సిన వాళ్లను మాత్రం మీసేవా కేంద్రాల సంఖ్య తక్కువగా ఉన్నా వారి పనితీరు బాగలేకున్నా నచ్చిన జిల్లాల్లోనే కొనసాగించినట్టు ఆరోపణలున్నాయి. వీరి వ్యవహార శైలి వల్ల అనుభవం, విద్యార్హతలున్న కొందరు డిస్ట్రిక్ట్ మేనేజర్లు ఉద్యోగం కోల్పోయి వీధిన పడిన పరిస్థితి ఉంది. కరీంనగర్, రంగారెడ్డి, నిజామాబాద్ ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న వాళ్లను కక్షపూరితంగా బదిలీ చేసినట్టు తెలుస్తుంది.

వీధిన పడ్డ డిస్ట్రిక్ట్ మేనేజర్లు

మీసేవా డిస్ట్రిక్ట్ మేనేజర్లకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే మధ్యంతరంగా విధుల్లోంచి తొలగించారు. తొలగించిన డిస్ట్రిక్ట్ మేనేజర్లలో ఎక్కువ మందికి 40 ఏళ్ల వయసు పైనే ఉంది. వారంతా మీసేవా ప్రాజెక్టులు ఎన్నో ఏళ్లుగా సర్వీస్ చేస్తూ వచ్చారు. ఎలాంటి తప్పిదాలు చేయకపోయినా నచ్చలేదన్న నెపంతో రాజకీయ నాయకుని మాటలు నమ్మి టిజిటిఎస్ ఉద్యోగులు ఇష్టానుసారంగా డిఎంలను తొలగించారు. ఇద్దరు, ముగ్గురు అధికారులు, ఓ ప్రతిపక్ష పార్టీ నాయకుడు కలిసి చేసిన అవినీతి అక్రమాలపై ప్రభుత్వం విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని పలువురు డిఎంలు కోరుతున్నారు. మీసేవా కేంద్రాల నిర్వహణ, ప్రజలకు నిర్ణయించిన ఫీజులకే వివిధ రకాల సేవలు అందించడం, సాంకేతిక సమస్యలొస్తే పరిష్కారం చూపడం వంటి పనుల్లో సేవలందించిన డిఎంలను అకారణంగా బదిలీ చేయడం, తొలగించడం వెనకాల భారీ అక్రమాలు చోటు చేసుకున్నట్టు ఆరోపణలున్నాయి.

మీసేవా మేనేజర్ల బదిలీలపై విచారణ జరపాలని డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.